కథానిక

# చంద్రకాంత పుష్పాలు

ఆకెళ్ల వెంకటేశ్వరరావు

చల్లగాలిలో షికారు వెళ్ళాను- రంగు రంగుల చంద్రకాంత పువ్వులు అప్పుడే వికసిస్తున్నాయి. చూడ చక్కగా ఉన్నాయి. వెలవెల బారుతున్న సూర్య కిరణాలు వాటి మీదపడి మరింత హృదయాకర్షంగా ఉన్నాయి. గాలికి గలగల ఊగుతున్నాయి. వాటిమీద జల్లిన నీటి చుక్కలు జలజల రాలుతున్నాయి. దూరాన మామిడి చెట్టుమీద కోకిల పల్లవిని ఆలాపిస్తోంది.

ఇది వసంతకాలం. ప్రకృతి శోభ ప్రతీచోటా కన్నులకి విందుచేస్తోంది. చెట్లు చిగురిస్తాయి. కొత్త పువ్వుల్తోనూ కొత్త కాయల్తోనూ, పళ్ళతోనూ రంగుల పాలవెల్లిలా ఉంటాయి. పక్షులు పాడతాయి. కమనీయమంజుల గీతాల్ని ఆలాపిస్తాయి.

కాని ఒక్క మానవుడే అయస్కాంతంలా ఉత్తర దక్షిణ ధృవాల్ని చూస్తాడు. వసంతకాలం ఎలాగా కొందరికే. అందరూ వసంతకాల శోభని ఆనందించ గలిగే కాలమెప్పుడొస్తుందో. అసలు వస్తుందో రాదో! వస్తుంది. తప్పకుండా వస్తుంది. ఏమో ఏంచెప్పగలం! నిన్న మొన్నటి వరకూ చంద్రకాంత పువ్వుల శోభ ఎలా ఉంటుందో నే నెరుగను.

చిన్న తనంలో పాఠం నేర్పేటప్పుడు మా మేష్టారడిగారు ఎర్రటి వస్తువుల పేర్లు చెప్పమని. అప్పుడు నాకు తెలిసిన వల్లా ఎర్ర కలం, ఎర్ర సిరా, గులాబి, మందార, రక్తం మాత్రమే. అవే చెప్పాను. ఆ నాడు ఎర్రని వస్తువుల్లో చంద్రకాంత పువ్వు నాకు తట్టలేదు. కాని ఈ నాడు చంద్రకాంతపు టెరుపులా ఏ ఎరుపూ నన్నాకర్షించలే దనుకుంటాను.

చల్లగాలి వీస్తోంది. సంధ్యాసమయ మయ్యింటుంది. ఆటువంటి సమయంలో చంద్రకాంతం చల్లగాలికి అటూ ఇటూ బుర్రనూపుతూ నృత్యం చేస్తుంటే సరిగ్గా అనేక రంగుల నక్షత్ర సముదాయం మిణుకు మిణుకుమన్నట్లు కనుపిస్తుంది.

తెల్లవారు జామున నాలుగు గంటలవేళ, చంద్రకాంతం, చంద్రుని కాంతుల్లో తళతళ మెరుస్తుంది. తనమీదనున్న మంచు బిందువుల్ని వయ్యారంగా నేలమీద జార విడుస్తుంది. జీవితంలో ఆటువంటి సుందర దృశ్యాల్ని ఏ కొద్ది మందో మాత్రం చూడగలం.

భోజనం చేసి చెయ్యి కడుక్కుంటున్నాను. వీధిలో ఏదో బండి ఆగిన చప్పుడయింది. అవును. ఈ వేళ మా అక్కా బావా రావాలిసిన దినం.

మా అమ్మకూడా యిందాకనే అంది, అక్కా బావా వస్తారు, బండికి వెళ్ళరా అని.

మా తమ్ముడు వెంకు కూడా వస్తానన్నాడు నానిని తీసుకు రావడానికి.

"నాని" మా అక్కయ్య కొడుకు. వాడికి నాలుగు సంవత్సరా లుంటాయి. బావ పంపిన ఫోటోనుబట్టి వాడు పాలకొల్లు శాండో అని చెప్పొచ్చు.

ఇంతకీ నేను బండికి వెళ్ళకుండానే వచ్చారు అక్కా బావాను. అక్క బండి దిగింది. చేతిలో ఫ్లాస్కు, ఇంకో చేతిలో మరచెంబూ ఉన్నాయి. బావ లోపలికి వచ్చాడు. నానిగాడు బండి దిగడానికి గొడవ చేస్తున్నాడు. ఇంట్లో అప్పటికున్న కుర్రవెధవలంతా వాడిచుట్టూ చేరి "బొజ్జిపిల్లి" పాట లంకించుకున్నారు. నాని నిజంగా "బొజ్జిపిల్లి"లా గుంటాడు.

అందరూ లోపలికి వచ్చారు. కుశలప్రశ్న లయాయి. పిల్లలందరూ నానిచుట్టూ చేరి ప్రశ్న లేస్తున్నారు.

"నీ పేలేతిలా?" అని ఒకడు, "నువ్వెక్కల నుంచి వచ్చావులా?" అని ఇంకోడు.

"వాడ్నేడిపించకండర్రా, వాడికొ్కత్త." అంది అమ్మ.

"ఏమోయ్! ఇలా రా," అన్నాడు బావ నవ్వుతూ.

"ఎవర్ని?" అని ప్రశ్నించాడు వెంకు.

"నిన్నేనోయ్, డింగరీ!" అన్నాడు బావ.

"వస్తున్నారా డింగలీ" అన్నాడు వెంకు ధైర్యంగా ముందడుగువేస్తూ. అందరూ ఫక్కుమని నవ్వారు. అమ్మ నానిని దగ్గరకు రమ్మని పిలిచింది. వాడు రాలేదు. పైగా గుడ్లు మిటకరించి దూలాల కేసి చూస్తున్నాడు.

"అమ్మమ్మ పిలుస్తుంటే వెళ్ళవేంరా, భడవా!" అంది అక్క.

"పోన్లేవే, ఇంకా కొత్తకదూ! నాలుగురోజులు పోతే వాడే వస్తాడ్లే." అని సర్దింది అమ్మ.

నానిని ఎత్తుకొని అమ్మకిచ్చాను. ఒళ్ళో కూర్చోపెట్టుకొని 'నీ పేరేంటి బాబూ" అంది అమ్మ.

"గౌరీచంకలపళాదు"అని"హిహిహీ"అన్నాడు అక్కకేసీ బావకేసీ చూచి.

ఇది మా నాన్నగారి పేరు. అందుచేతనే వాడిని 'నాని' అని పిలుస్తారు.

• • •

మర్నాడు సాయంకాలం తోటలోకిపోయాను. నిన్నసాయంకాలం నేనెంతో ప్రియంగా చూచిన చంద్రకాంతాలు నేలమీద ధూళిలో పొర్లాడు తున్నాయి. క్రిందటిరోజున కలకలలాడుతూ నా హృదయాన్ని ఎంతగానో ఆకర్షించిన పుష్పాలు కృశించి, వాడిపోయిన నిర్జీవదేహాలతో అమాయకంగా చూచాయి. నిస్పృహతో యింటికి పోతున్నాను. అప్పుడే అనుకున్నా, "నిన్న సాయంత్రం చూచిన పువ్వులీవేళ లేవని విచారించడం అనవసరం. పదేళ్ళక్రితం జీవించిన నేను ఇప్పుడు లేనే. అలాగే యిప్పుడున్న నానికీ పదేళ్ళ తరువాత నానికీ చాలా తేడా ఉండక మానదు. జీవిత వలయం తిరుగుతున్నంతసేపూ జీవితంలో మార్పుంటుంది. మార్పు లేకపోతే జీవితం రోత.

• • •

తులసికోట దగ్గర కూర్చొని కబుర్లుచెప్పుకుంటున్నారు. నాని మా బావ భుజంమీదకెక్కి కూర్చున్నాడు. వాడి చుట్టూ పరుగెత్తుతున్నారు పిల్లలంతా.

అమ్మ నానిని రమ్మని పిలిచింది. వెళ్ళి ఆవిడ ఒళ్ళో కూర్చున్నాడు.

"చూడమ్మా! మీ నాన్నగారి పేరెట్టినందుకు సరైనవాడనిపించాడు. వీడు నిజంగా ఆ పిల్లలందరూ అరిచినట్లు బుజ్జిపిల్లేనే" అంది అమ్మ నవ్వుతూ.

అక్క సిగ్గుతో తలవంచుకొని చిరునవ్వు ఒలకబోస్తోంది.

"అచ్చంగా వీడిలాగే ఉండిపోతే ఎంత బాగుంటుంది!" అన్నాడు బావ తన కొడుకుని గర్వంగా చూస్తూ.

"ఎందుకు?" అన్నాను ఆదుర్దాగా.

"అదేంటోయ్! ఎందుకంటావేం? ఈ వయస్సులో ఉన్న పిల్లలెంత ముద్దొస్తూంటారో ఎరుగుదువూ!" అన్నాడు బావ నవ్వుతూ.

"చప్పున పెళ్ళిచేస్తే సరి అదీ తెలుస్తుంది" అంది అక్క. భయంతో ఇంట్లోకి వెళ్ళిపోయాను.

* * *

పదేళ్లు గడచిపోయాయి. బొంబాయి పోతూ పోతూ అక్కనీ బావనీ చూసిపోదాం కదా అని బెజవాడలో దిగాను.

ఈ పదేళ్ళలోనూ ఎన్ని చంద్రకాంత పువ్వులు వికసించి నేలమీద విశ్రాంతి తీసుకున్నాయో. ఎన్ని పగళ్ళూ, రాత్రులూ కాలగర్భంలో కలిసిపోయాయో. ఎన్ని దుర్భర జీవితాలు విముక్తి పొంది అనంతాకాశంలో లీనమైపోయాయో. ఈ పదేళ్ళలోనూ నీలినింగిని వెలుగుతూ, తళుకు తళుకు మంటున్న ఎన్ని నక్షత్రాలు నిశ్శబ్దంగా నేలమీద ఒరిగిపోలేదు! ఎన్ని వినూత్న జీవితాలు ఆవిర్భవించలేదు? నా జీవితం సయితం ఎంతో మార్పు పొందింది.

నేనొకసారొక స్నేహితునికోసం పల్లెటూరు వెళ్ళాను. మాటల్లో ఒక ముసలాడు "మా అమ్మాయిని చూడ్డానికి బొంబాయి పోవాలిబాబూ" అన్నాడు.

"ఎందుకు చూడ్డం" అన్నాను.

"అదేం బాబూ ఎందుకంటావేం? అయిదేళ్ళక్రితం నా కూతుర్ని ఓ బాబు చేతుల్లో పెట్టాను. ఇప్పటివరకూ అది ఎట్లాబతుకుతున్నదో చూళ్లేదు. అది సుఖంగా ఉన్నదో, ఏం కష్టాలు పడుతుందో చూడొద్దామరి!" అన్నాడు.

అప్పుడే నాకూ తట్టింది బంధువుల్ని చూడాలనే కాంక్ష. అదే వారి జీవితాల్ని, అందులోని మార్పును చూడాలనే కాంక్ష. ఆ కాంక్షతోనే యీ నాడు మా అక్కనీ బావనీ చూడ్డానికి బెజవాడ వచ్చాను.

కుర్చీలో కూర్చున్నాడు బావ. పక్కనున్న బల్లమీద ఒక కుర్రాడు ఏదో చదువుతున్నాడు. ఆ పిల్లవాడెవరై ఉంటాడో నేనూహించుకోలేక పోలేను. చాలా పరిచయమున్న ముఖంలాగనే కనిపించింది. కాని గుర్తుపట్టలేక పోయాను.

కుశలప్రశ్నలయ్యాక "నాని" ఎక్కడున్నాడని అడిగాను.

"ఇదుగో వెధవ ఇక్కడున్నాడు" అన్నాడు పక్కనున్న పొట్టిపిల్లాడిని చూపెడుతూ.

నానిముఖంలో విషాదరేఖలు ప్రస్ఫుటంగా కనిపించాయి. బావముఖంలో ఉద్ధృతంగా విసుగుదల కనిపించింది.

తరువాత అక్క చెప్పింది. నాని పొట్టిగా ఉన్నాడని బావకసహ్యం. రోజూ "పొట్టి వెధవ పొట్టి వెధవ" అని తిడతాడట.

మార్పులేని జీవితంలో నిరాశ ప్రబలి నిస్పృహతో కుమిలి, క్రుంగి, కృశించి పోతున్నాడు నాని. ఒకనాడు నేలరాలిన చంద్రకాంతాల్ని చూచి విచారించాను. ఎప్పుడూ నేలరాలని చంద్రకాంతాలవల్ల ఆ పుష్పంలోని అందం ఏమీ తెలియదు. ఎల్లకాలమూ ఒకేవిధంగా ఉంటే బాగుండునన్న బావ నానిని చూచి అసహ్యించుకొంటున్నాడు కదా!

జీవితంలో మార్పు లేకపోతే మనకి జీవితం మీద ఆశ ఎలాగుంటుంది? సుఖం ఎలాగుంటుంది?

(ఆధారం: గార్డ్‌నర్)

---

కథానిక

# సహకరించిన ఇలవేల్పు

కె. ఆర్. రెడ్డి

"అరటి తోటలోనే దొంగలించావు! అదీ గోపాల్ రెడ్డి తోటలో! హమ్మ బాబోయ్. ఇక వీడి వీపు బద్దలయి ఎముకలు గుల్లయిపోతాయి యివాళ!" ముక్కుమీద వేలేసుకుంది మంగమ్మ.

"మొన్న గడ్డి దొంగలించినపుడే కుయ్యో-మొర్రో అంటూ కాళ్ళావేళ్ళా పడితే-ఏదో పాపం అని వదిలేశాడు. ఇవాళ మట్టుకు రెడ్డి చేతుల్లో వాడి దివసాలు తీరిపోతవి!" చంకలోని కడవ కుదిటిమీద దించి పెడుతూ చెప్పుక పోయింది మీనాక్షమ్మ.

వీరారెడ్డి పేరువింటే ఆ చుట్టుపట్టుపల్లెల్లో పాలు తాగే పసికందు కూడా గజగజ వణకిపోతాడు. కడకు కాకిపిల్లకూడా అతడు నడిచేత్రోవల్లో కావుమని అరవటానికి వీల్లేదు. అంత హోదా అంత ఠీవి!

బిఱ్ఱుగా బిగియపట్టి వెనుకకు కట్టిన పిడచ జుట్టు, మెలియతిప్పి పైకి వదిలిన నల్లని ఖుర్రమీసాలు—గంభీరమైన ముహం—"ఏరా-వెధవా!" అని హుంకరించాడంటే ముందున్నవాడు నిలువునా కంపించి కుప్పగా కూలిపోవాలి. అంతటి కాఠిన్యం ఆ కంఠ స్వరంలో.

ఆ హోదాకు-ఆ ఠీవికి అతడి ఆకార కాఠిన్యాలే కారణాలు అని చెప్పడానికి వీల్లేదు. ఆ మాటకువస్తే మాలవాడలోని ముత్తడుకూడా యింతకంటే ఠీవిగా వుంటాడు. వాడూ పెంచాడు మూరడేసి మెలిత్రిప్పిన సోగ మీసాలు. కానీ ఏం ప్రయోజనం? అన్నిటికీ ఆకార స్వరూపాలిచ్చే ఆ లక్ష్మీదేవి తెరవెనకాలుంటేనేగా నాటకాలు సవ్యంగా సాగడానికి! ఆ చుట్టుప్రక్కల ఏడూళ్ళూ వీరారెడ్డికి మాణ్యము. అతడి ఆజ్ఞలేకుంటే ఆ పొలిమేరల్లో కాకి కూడా కాలు కదపడానికి వీల్లేదు. అతడి మాట తీసుకొనందే ఆ వూళ్ళో ఎవడూ ఏ పనీ చెయ్యడానికి వీల్లేదు. ఎక్కడ ఏ తప్పు జరిగినా-ఏ